సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 18 । జూన్ । 2023



మా భూమి మాకిచ్చేయండి

మంచిప్ప రిజర్వాయర్ వద్ద నిర్మాణ సంస్థ వినియోగించుకుంటున్న తమ భూములను తిరిగి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు.

- 8లో ▸



'దశాబ్ది'తో తండాలు కళకళ

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన గిరిజనోత్సవ కార్యక్రమాలతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.4 /28.9

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ప్రకాశవంతంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చెరువులు, కాలువలు కబ్జా చేస్తే చర్యలు

- ఇరిగేషన్ డీఈ బాల్‌రాజు



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ నగరంలో ఎవరైనా చెరువులు, కాలువలు కబ్జా చేసినట్లు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ బాల్‌రాజ్ తెలిపారు. 'సాక్షి'లో ఇటీవల 'ఇటు చెరువు.. అటు కాలువ' శీర్షికన చెరువులు, కాలువలు కబ్జాపై కథనం వచ్చింది. రామ్మూర్తి చెరువు, గోశాల వెనుక భాగంలో చెరువు కబ్జా చేశారనే కథనాలు వచ్చాయి. దీనిపై ఇరిగేషన్ అధికారులు రెండు రోజుల నుంచి తనిఖీలు చేస్తున్నారు. కొంతమంది ఇరిగేషన్ శాఖ వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి మరీ కబ్జా చేస్తున్నట్లు తెలిపారు. గత నెలలో రామ్మూర్తి చెరువు కబ్జాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రామ్మూర్తి చెరువు 38 ఎకరాల్లో ఉండగా, కేవలం 3 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. చెరువులు, కాలువలు కబ్జాలపై ఇంకా పరిశీలన జరుగుతుందన్నారు. ఇందులో ఇరిగేషన్ అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

నేటి నుంచి టీ-9 టిక్కెట్ పథకం అమలు



ఖలీల్‌వాడి : తెలంగాణ ఆర్టీసీ తొలిసారిగా ఆదివారం నుంచి పల్లె వెలుగు బస్సుల్లో మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం టీ-9 టికెట్ పథకం ప్రవేశ పెడుతోందని ఆర్ఎం ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా రూ. 100 చెల్లిస్తే 60 కిలోమీటర్ల పరిధిలో రాకపోకలకు ప్రయాణించే అవకాశం కల్పించారు. టీ-9 టికెట్‌తో ప్రతి ఒక్కరు రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా చేసుకోవాలన్నారు. టీ-9 టిక్కెట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వర్తిస్తుందన్నారు. టిక్కెట్ పల్లె వెలుగు బస్సు కండక్టర్ వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడుపొద్దు

- ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్



ఖలీల్‌వాడి : నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో వాహనాదారులు అపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడుపరాదని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలను నడపడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కమాండ్ కంట్రోల్ ద్వారా సీసీ కెమెరాల ద్వారా గమనించి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి



ధర్పల్లి: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలో షాదీ ఖానాలో శనివారం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ బిన్ హందన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేశ్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, నాయకులు శేఖర్ గౌడ్, చెలిమెల నర్సయ్య, శ్రీధర్ గౌడ్ శ్రీనివాస్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ రిజిస్ట్రార్‌ల సస్పెన్షన్



తెయూ పాలకమండలి సమావేశంలో విద్యాకమిషనర్ నవీన్ మిట్టల్, తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, సభ్యులు

- ప్రొ. విద్యావర్ధిని, ప్రొ.కనకయ్యలపై ఈసీ సమావేశంలో తీర్మానం
- పీహెచ్‌డీ స్కామ్‌పై ఓయూ అధ్యాపకులతో విచారణ
- కాంట్రాక్టు అధ్యాపకుడు శ్రీనివాస్ రిమూవల్
- సిబ్బంది తీసుకున్న అడ్వాన్సులు రికవరీ
- ఏసీబీ దాడులతో ఈసీ సమావేశానికి హాజరు కాలేక పోయిన వీసీ రవీందర్

తెయూ (డిచ్‌పల్లి) : మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రొఫెసర్ కనకయ్యలను సస్పెన్షన్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి (ఈసీ) తీర్మానం చేసింది. తెయూ 61వ ఈసీ సమావేశం హైదరాబాద్‌లోని రూసా భవనంలో శనివారం జరిగింది. వైస్ చాన్స్‌లర్ డి రవీందర్ గుప్తా ఉదయమే హైదరాబాలోని తన స్వగృహంలో ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఈసీ సమావేశానికి హాజరు కాలేకపోయారు. దీంతో కళాశాల విద్యాకమిషనర్ నవీన్ మిట్టల్ సమావేశానికి చైర్మన్‌గా వ్యవహరించారు. వర్సిటీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

తెయూ ఈసీ తీర్మానాలు..

ఈసీ ఆమోదం లేకుండా వీసీ రవీందర్ నియమించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ శివశంకర్, ప్రొఫెసర్ విద్యావర్ధిని లపై నిర్ధారిత నేరారోప అభియోగాల (ఆర్టికల్ ఆఫ్ చార్జెస్) కింద కేసులు నమోదు చేయాలి.

■ వీసీ అవినీతి, అక్రమాలకు సహకరించిన కనకయ్య, విద్యావర్ధిని ల ను సస్పెండ్ చేయాలి.

■ ఏరియర్స్ పేరిట అక్రమంగా రూ.10 లక్షలు తీసుకున్న కాంట్రాక్టు అధ్యాపకుడు శ్రీనివాస్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలి.

■ వివిధ కారణాలతో వీసీ పీఏలు, ఇతర సిబ్బంది తీసుకున్న అడ్వాన్సులు మొత్తం వెంటనే రికవరీ చేయాలి.

■ ఇటీవల నిర్వహించిన అధ్యాపకుల క్యాస్ (కేరీర్ అడ్వాన్స్ స్కీం) పదోన్నతులకు ఆమోదం. వారికి రావాల్సిన ఎరియర్స్ చెల్లించాలి.

అర్హత గల అధ్యా పకులకు రొటీన్‌గా క్యాస్ పదోన్నతులు కల్పించడం.

■ 2021 –2023 వరకు నిర్వహించిన పీహెచ్‌డీ అడ్మిషన్లపై ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుల చేత విచారణ జరిపించాలి.

ఈసీ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్ నసీమ్, ప్రొఫెసర్ ఆరతి, కె రవీందర్ రెడ్డి, వసుంధర దేవి, మారయ్యగౌడ్, గంగాధర్ గౌడ్, ప్రవీణ్ కుమార్, ఎస్ఎల్ శాస్త్రి హాజరు కాగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, ఆర్థిక శాఖ డిప్యూటీ డైరక్టర్ చంద్రకళ, రాజేందర్‌రెడ్డి గైర్హాజరయ్యారు.

క్యాంపస్‌లో ఏసీబీ సోదాలు

- కంట్రోలర్‌ను పిలిపించిన అధికారులు



కంట్రోలర్ అరుణ సమక్షంలో కంప్యూటర్‌లో వివరాలను తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ గుప్తా శనివారం ఉదయం హైదరాబాద్, తార్నాకలోని తన నివాసంలో ప్రైవేటు కళాశాల యజమాని నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. భీంగల్‌లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలకు పరీక్ష కేంద్రం కేటాయింపు కోసం లంచం డిమాండ్ చేశారు. కళాశాల యజమాని దాసరి శంకర్ ఏసీబీని ఆశ్రయించి వారి సూచనల మేరకు వీసీని కలిసి డబ్బులు అందజేశారు. అప్పటికే ఏసీబీ డీఎస్పీ టి సుదర్శన్ నేతృత్వంలో కాపుకాసిన అధికారులు వీసీ రవీందర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. హౌదరాబాద్‌లోని వీసీ నివాసంతో సోదాలు నిర్వహించారు. అలాగే మరో బృందాన్ని యూనివర్సిటీలో సోదాల కోసం పంపించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఐదుగురు సభ్యుల బృందం తెయూ పరిపాలనా భవనం చేరుకుంది. పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్) ప్రొఫెసర్ ఎం అరుణ సెలవులో ఉండటంతో ఆమెకు ఫోన్ చేసి క్యాంపస్‌కు పిలిపించారు. ఆమె రాత్రి 7.15 గంటలకు పరీక్షల విభాగానికి చేరుకున్నారు. కంట్రోలర్ వచ్చేలోగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్ ను ఏసీబీ అధికారులు విచారించారు. యూజీ సెక్షన్‌లో రికార్డులు పరిశీలించారు. కంట్రోలర్ అరుణ వచ్చిన తర్వాత ఆమెను పరీక్ష కేంద్రాల కేటాయింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె సమక్షంలో పలు రికార్డులను పరిశీలించారు. అర్ధరాత్రి వరకు సోదాలు కొనసాగాయి. హైదరాబాద్, తార్నాకలోని వీసీ స్వగృహంలో సైతం అర్ధ రాత్రి వరకు సోదాలు కొనసాగాయి.

వీసీ ఇంట్లో పలు డాక్యుమెంట్లు లభించడంతో మరో బృందం నల్గొండ జిల్లాలో సైతం సోదాలు నిర్వహించినట్లు సమాచారం.

హస్తం కోవర్టుల మయం!

- ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌లో గుబులు రేపుతున్న మిలాఖత్ వ్యవహారాలు
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో అంటకాగుతూ లబ్ధి
- టిక్కెట్ల రేసు నేపథ్యంలో కార్యకర్తల ఆవేదన



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో రాజకీయ పార్టీల మధ్య ఎత్తులు పైఎత్తులు, వ్యూహాలు, ప్రతివ్యూహాలు సర్వసాధారణం. ఆయా పార్టీల్లో ప్రత్యర్థి పార్టీల కోవర్టులు సైతం తమ కార్యకలాపాలు నడిపించడం గతంలో అక్కడక్కడా ఉండేది. కాగా ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఈ కోవర్టుల సంస్కృతి ఒక వృత్తి మాదిరిగా తయారైనట్లు ఆయా పార్టీల శ్రేణులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కొందరు కాంగ్రెస్ నాయకులను కోవర్టులుగా మార్చుకుని పకడ్బందీగా వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. వీటి గురించి కార్యకర్తలు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

■ నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ప్రథమ శ్రేణి నుంచి తృతీయ శ్రేణి నాయకులను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తమ మనుషులుగా మార్చుకున్నట్లు కాంగ్రెస్ కార్యకర్తలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

■ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పలువురు ప్రథమ శ్రేణి కాంగ్రెస్‌నాయకులు అధికారపార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధితో కలిసి తమ వ్యవహారాలను దర్జాగా చక్కబెట్టుకుంటున్న విషయం బహిరంగ రహస్యమైంది. కొందరు కాంగ్రెస్ నాయకులైతే ఏకంగా సదరు కీలక ప్రజాప్రతినిధి వద్ద ప్రతి నెలా డబ్బులు తీసుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ప్రభుత్వ, అసైన్డ్ భూములు, చెరువులు, కెనాల్స్ ఆక్రమించి అక్రమంగా వేస్తున్న వెంచర్లలో సైతం బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులతో కలిసి వాటాలు పంచుకుంటున్నట్లు సమాచారం. అదేవిధంగా వివిధ వ్యాపారాలు, మడిగెలు పొందడం, వైన్స్‌ల్లో భాగస్వామ్యం తదితర వ్యవహారాలను దర్జాగా చేసుకుంటున్నారు. గుట్టలు కూడా కలసికట్టుగా స్వాహా చేసి మొరం అమ్ముకున్నట్లు కింది స్థాయి కార్యకర్తలు చెబుతున్నారు. చివరకు అర్బన్ నియోజకవర్గంలో హాథ్‌సే హాథ్ జోడో యాత్రకు సైతం బీఆర్ఎస్ నుంచి స్పాన్సర్ పొందుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పెట్టుబడి పెట్టడమేమిటంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీజేపీ, ఎంఐఎం పార్టీలపై విమర్శలు చేయవద్దంటూ ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ నాయకులు ద్వితీయ శ్రేణి నాయకులకు సూచిస్తుండడం గమనార్హం.

■ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కొందరు ప్రథమ శ్రేణి నాయకులు అధికార పార్టీతో సఖ్యతగా ఉంటూ కాంగ్రెస్‌కు గండికొట్టేలా వ్యవహరిస్తున్నారంటూ కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. బాల్కొండ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో అంతగా ప్రాధాన్యత లేని కాంగ్రెస్ నాయకుడిని బీఆర్ఎస్ ప్రోత్సహిస్తుండడం విశేషం.

■ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో సైతం ప్రథమ శ్రేణి కాంగ్రెస్ నాయకులకు ఒక జాతీయ స్థాయి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి ఆర్థిక వనరులు సమకూరుస్తున్నట్లు కార్యకర్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో టిక్కెట్ల కేటాయింపు విషయంలో ఏవిధంగా ముందుకు వెళ్లాలంటూ పీసీసీ నేతలు తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి కోవర్టులున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థులను ఎన్నికల బరిలో ఏవిధంగా ఎదుర్కోవాలంటూ పీసీసీ నాయకత్వం తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక విజయోత్సాహం నీరుగారిపోతోందని కొందరు సీనియర్ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు.



పోలీస్‌సిబ్బంది సందేహాలను తీరుస్తున్న డీసీపీ(ఏఆర్) గిరిరాజు



అభ్యర్థుల వివరాలను, సర్టిఫికెట్‌లను పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది

72 మంది గైర్హాజరు

ఖలీల్‌వాడి : పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహిస్తున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు జిల్లా కేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో నాలుగవ రోజు శనివారం 578 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 72 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కొంత మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు కాలేజీలో ఉండటంతో కస్టోడియన్ సర్టిఫికెట్ తీసుకువెళ్లడంతో మళ్లీ తేదీలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ (ఏఆర్) గిరిరాజు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతుంది.

ఐటీలో మనమే మేటి

- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా త్వరలో ఐటీ హబ్ ప్రారంభం



నిజామాబాద్ నాగారం : ప్రస్తుతం ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తున్న ఐటీ రంగంలో మనమే మేటిగా ఉన్నామని ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. త్వరలోనే నగరంలోని ఐటీ హబ్‌ను మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఐటీ హబ్‌ను ఆయన పరిశీలించారు. అంతర్జాతీయ సంస్థలకు వేదికగా ఇందూరు ఉంటుందన్నారు. ఐటీ హబ్‌తో ప్రత్యక్షంగా 765 మందికి ఉద్యోగాలు, పరోక్షంగా 4 రేట్లు ఎక్కువ మందికి ఐటీ కొలువులు వస్తాయన్నారు.

ట్రాన్స్‌జెండర్లను గౌరవించాలి

- హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ
- పోస్టల్ బీమాపత్రాల అందజేత



ట్రాన్స్‌జెండర్‌కు ప్రమాద బీమా బాండ్ ఇస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ తదితరులు

ఖలీల్‌వాడి: ట్రాన్స్‌జెండర్లను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ అన్నారు. శనివారం జిల్లా కోర్టు భవన సముదాయంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లకు పోస్టల్ శాఖ ద్వారా అమలవుతున్న గ్రూప్ యాక్సిడెంటల్ పాలసీ బాండ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను చిత్రీకరిస్తూ అష్ట గంగాధర్ రూపొందించిన వీడియోతో కూడిన పాటను ఆవిష్కరించారు. జస్టిస్ శ్రీసుధ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష చూపడం తగదన్నారు. వారికి అన్ని రంగాల్లో అవకాశాలు లభించేలా కృషి చేయాలన్నారు. పోస్టల్ శాఖ ద్వారా కేవలం రూ.399 ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాద బీమాతో పాటు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. గ్రూప్ యాక్సిడెంటల్ పాలసీ గార్డ్‌ను ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లకు అందించడం అభినందనీయమన్నారు. దీనికి సహకరించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులను ప్రశంసించారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు అందిస్తున్న పోస్టల్ ప్రమాద బీమా గురించి ప్రచారం కల్పించాలన్నారు. జిల్లా జడ్జి సునీత మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు, సెక్స్ వర్కర్లకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. దాతలు ముందుకు వచ్చి రూ.30 వేలు విరాళం అందించినట్లు తెలిపారు. దీనిని 50 మందికి ప్రీమియం కోసం ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం అనంతరం హైకోర్టు జడ్జి, న్యాయాధికారులతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు.

హైకోర్టు జడ్జికి స్వాగతం పలికిన జిల్లా జడ్జి, కలెక్టర్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శ్రీసుధ

హైకోర్టు జడ్జి శ్రీసుధ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద జిల్లా జడ్జి సునీత, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, నిజామాబాద్ ఆర్డీవో రవి, డీసీపీ (అడ్మిన్) మధుసూదన్ రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి తదితరులు స్వాగతం పలికారు. ఆమె పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

తండ్రే దైవం

- గుడికట్టి విగ్రహం పెట్టిన కానిస్టేబుల్ కృష్ణసాగర్



డొంకేశ్వర్‌లో రాజన్న గుడి



తండ్రి విగ్రహం వద్ద కృష్ణ సాగర్

డొంకేశ్వర్ (ఆర్మూర్) : కష్టపడి పెంచి, చదివించిన తండ్రికి ప్రేమతో ఏకంగా గుడి కట్టించాడో పోలీస్ కానిస్టేబుల్. విగ్రహాన్ని తయారు చేయించి అందులో నాన్నను చూసుకుంటున్నాడు. డొంకేశ్వర్‌కు చెందిన కీని నల్ల రాజన్నకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె. పిల్లలను ఆప్యాయంగా పెంచి పెద్ద చేశాడు. అయితే, 2018 అక్టోబర్ 3న గుండెపోటుతో అకాల మరణం చెందాడు. తండ్రి మరణాన్ని కూతురు, కొడుకులు తట్టుకోలేకపోయారు. తండ్రి కోరిక మేరకు చిన్న కొడుకు కృష్ణసాగర్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. రాజన్న బతికుండాగానే కొడుకును పోలీస్‌గా చూసి కన్నుమూశాడు. తండ్రిని విగ్రహంలో చూసుకోవాలని భావించిన కృష్ణసాగర్ సొంత వ్యవసాయ క్షేత్రంలో గుడి కట్టించాడు. తండ్రి విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించారు. ప్రతి నెల 3న తండ్రి గుడికి వెళ్లి ఇంటిల్లి పాదిల్లి పూజలు చేస్తారు. రాజన్న విగ్రహాన్ని చూస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. ప్రతి ఏటా అన్నదానం కూడా నిర్వహిస్తారు. తండ్రికి ఎంత చేసినా తక్కువేనని, ఆయనకు జన్మించడం మా అదృష్టంగా భావిస్తున్నామని కృష్ణసాగర్ 'సాక్షి'తో పేర్కొన్నాడు.

నేడు ఫాదర్స్ డే..

సండే స్పెషల్

తనయుడికో గుడి

జ్ఞాపకాలను మరిచిపోలేని తండ్రి



జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండాకు చెందిన బానావత్ రాములు, మారుబాయి దంపతుల చిన్న కుమారుడు బానావత్ సురేశ్ 1993 జూన్ 29న జన్మించాడు. ఆర్మూర్‌లో చదువుకుంటుండగా సురేశ్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి సురేశ్‌కు క్యాన్సర్ సోకినట్లు నిర్ధారించా రు. బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన తండ్రి రాములు విషయం తెలుసుకుని ఇంటికి తిరిగి వచ్చాడు. కన్న కొడుకును బతికించుకోవాలని ఆరాట పడ్డాడు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి కూడబెట్టిన డబ్బంతా కుమారుడి ఆరోగ్యం కోసం ఖర్చు చేశాడు. కానీ ఫలితం లేకుండా పోయింది. సురేశ్ క్యాన్సర్ వ్యాధితో ఏడేళ్లుగా పోరాడి 2004 డిసెంబర్ 3న మరణించాడు. అప్పటి నుంచి కుమారుడిని మర్చిపోలేకపోయారు కన్న తల్లిదండ్రులు. తనకున్న వ్యవసాయ క్షేత్రంలో కుమారుడి జ్ఞాపకార్థంగా గుడి కట్టుకున్నారు. గుడిలో కుమారు డి ఫొటోలను పెట్టుకుని పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి యేటా కుమారుడి మరణించిన రోజున గ్రామస్తులుకు అన్నదానం చేస్తున్నారు. గుడి ముందు కుమారుడు గుర్రంపై పాఠశాలకు వెళ్తున్నట్లు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు.



గుర్రంపై పాఠశాలకు వెళ్తున్నట్లు సురేశ్ విగ్రహం

క్లుప్తంగా

సుప్రీం తీర్పులను సేకరించి కేసులు దాఖలు చేయాలి



ఖలీల్‌వాడి: డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ లక్ష్మినర్సయ్య ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నేరస్తులకు శిక్ష పడేటట్లు సుప్రీంకోర్టు నూతన తీర్పులను సేకరించి కేసులు దాఖలు చేయాలని సూచించారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు రవిరాజ్‌, రాజ్‌గోపాల్‌ గౌడ్‌, కవితారెడ్డి, ఆవారి రమేష్‌, నంద రమేష్‌, శేషు, నిమ్మ దామోదర్‌రెడ్డి, డాక్టర్‌ సమ్మయ్య, అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

పిల్లలకు అన్నీ తానై..

- పెంచి పెద్ద చేసిన తండ్రి

నిజామాబాద్‌ సిటీ : నిజామాబాద్‌ రూరల్‌ మండలం గుండారం గ్రామ ఉపసర్పంచ్‌ ఒంటెల శంకర్‌రెడ్డి భార్య విజయలక్ష్మి 1997 సంవత్సరంలో మృతి చెందినది. అప్పుడు కొడుకు హరిహరన్‌ రెడ్డి వయస్సు 5 సంవత్సరాలు, కూతురు హరిణి రెండున్నర సంవత్సరాలు మాత్రమే. భార్య మరణంతో కుంగి పోయిన శంకర్‌రెడ్డి తన పిల్లలకు మంచి జీవితాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. అందుకు మరో వివాహం చేసుకోలేదు. పిల్లలకు ఆర్థిక అవసరాలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు డబ్బుల సంపాదన కోసం పిల్లలను ఒకటో తరగతి నుంచే ప్రైవేటు పాఠశాలలోని హాస్టల్‌లో చేర్పించి తాను దుబాయి దేశానికి వలస వెళ్లాడు. ఏడాదిలో రెండు మూడు సార్లు వచ్చి పిల్లలను చూసేవాడు. ఆర్థికంగా స్థిరపడ్డక దుబాయి కంపెనీ నుంచి వచ్చే లక్షలాది రూపాయలు వదులుకుని ఇక్కడే ఉండిపోయాడు. వారి వివాహాలూ చేశాడు. కొడుకును బీటెక్‌, కూతురును పీజీ పూర్తి చేశారు.



కూతురు, కుమారుడితో శంకర్‌రెడ్డి

అమ్మలేని లోటు కనిపించలేదు

నా చిన్నతనంలోనే అమ్మ దూరం అయ్యింది. కానీ ఏనాడు అమ్మలేని లోటు నాన్న మాపై పడనీయలేదు. అమ్మ బతికి ఉన్నప్పుడు తమను ఎలా పెంచుతుందో నాన్నా అంతకంటే ఎక్కువగా పెంచాడు. హాస్టల్‌ ఉన్నప్పుడు ఒకసారి నాకు జ్వరం వస్తే నాన్న దుబాయి నుంచి వచ్చి ఆసుపత్రిలో చూపించి, ఇంటికి రాకుండా తిరిగి దుబాయికి వెళ్ళటం ఎప్పటికి గుర్తుండి పోతుంది. – హరిహరన్‌రెడ్డి

నాకు మా నాన్నే సర్వం

ఆడపిల్ల ఎదుగుదలకు అమ్మ సహాయం తప్పనిసరి అంటారు కానీ, మా నాన్న మాకు అన్నీ తానై పెంచాడు. నా డెలివరీ సమయంలో నాన్న నా ప క్కనే ఉండి అన్ని సపర్యాలు చేసి అమ్మలేని లోటు తీర్చాడు. – హరిణి

సండే స్పెషల్

అమ్మను మరిపించిన నాన్న

ఆర్మూర్‌ : ఆర్మూర్‌ పట్టణానికి చెందిన శికారి రాజు ఆర్మూర్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పట్టణంలోని రాజారాం నగర్‌ కాలనీకి చెందిన సవితతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కొడుకులు పుట్టిన తరువాత 2016 ఆగస్టులో ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో హిందీ పడిత్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఆకస్మికంగా మరణించింది. ఆమె మరణం సమయంలో వీరి ఇద్దరు కొడుకుల్లో పెద్ద వాడైన శికారి కశ్యప్‌ రాజ్‌ ఎనిమిదో తరగతి, చిన్న కొడుకు శికారి కౌషిక్‌ రాజ్‌ ఐదో తరగతి చదువుతున్నాడు. కుటుంబ ఆలనా, పాలనా చూసుకోవాల్సిన ఇంటి ఇల్లాలు మృత్యువాత పడటంతో ఆ ముగ్గురి జీవితాలు తలక్రిందులుగా మారిపోయాయి. భార్య, పిల్లలపై ఉన్న ప్రేమ మమకారంతో శికారి రాజు మళ్లీ వివాహం చేసుకోకుండా తన ఇద్దరు కొడుకులకు తండ్రితో పాటు తల్లిగా కూడా మారాడు. సమయ పాలన లేని ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ రోజూ పిల్లలకు వంట చేసి పెడుతూ, స్కూళ్లకు పంపిస్తూ , చదువుల్లో తగిన సలహాలు సూచనలు ఇస్తూ అటు ఉద్యోగ బాధ్యతలు.. ఇటు ఇంటి బాధ్యతలను నిర్వహిస్తూ వస్తున్నాడు. ప్రస్తుతం పెద్ద కొడుకు పాలిటెక్నిక్‌ డిప్లొమా పూర్తి చేసాడు. చిన్న కొడుకు ఇంటర్మీడియట్‌ పూర్తయింది. చివరి వరకు పిల్లలకు తల్లి లేని లోటు తెలియకుండా అన్నీ తానై చూసుకుంటున్న తమ తండ్రిని మించిన మరొకటి ఏముంటుందని ఇద్దరు పిల్లలు భావోద్వేగానికి గురవుతున్నారు.



కొడుకులతో శికారి రాజు

మా భూమి మాకిచ్చేయండి

- 'మంచిప్ప'లో బాధిత రైతుల ఆందోళన
- సిమెంట్‌ సైలో పైకి ఎక్కి నిరసన
- నాలుగెకరాలు వినియోగించుకుంటున్న కంపెనీ ప్రతినిధులు
- అర్ధంతరంగా ముగిసిన చర్చలు



ధర్నా చేస్తున్న బాధిత రైతులు



సిమెంట్‌ సైలో పైకి ఎక్కిన రాములు

మోపాల్‌: మంచిప్ప రిజర్వాయర్‌ సర్జిపుల్‌ వద్ద పరికరాలు, సామగ్రి, కంపెనీ కార్యాలయం కోసం వినియోగించుకుంటున్న భూమి ఇచ్చేయాలని బాధిత రైతులు శనివారం ఆందోళన చేట్టారు. ప్రాజెక్ట్‌ పనులు చేపడుతున్న కంపెనీ రైతులతో 2016లో చేసుకున్న ఒప్పందం ప్రకారం కౌలు చెల్లిస్తూ వస్తోంది. ఆ ఒప్పందం గత నెలతో ముగిసింది. తిరిగి ఒప్పందం చేసుకుందామంటే రైతులు ముందుకు రావడంలేదు. భూమి ఇచ్చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈక్రమంలో రైతులు కంపెనీకి నోటీసు అందజేశారు. అప్పటి నుంచి చర్చలు కొనసాగుతున్నాయి. రైతుల డిమాండ్‌ మేరకు రెండెకరాలను ఇచ్చేస్తామని చెప్పారు. మరో రెండెకరాలకు ఆరు నెలల గడువు ఇవ్వాలని కోరారు.

ఉద్రిక్త పరిస్థితులు

మంచిప్పలోని చింతకుంట రాములు, గూండ్ల సాయిలు, నరేందర్‌, యమున అనే రైతులు 2016, 2018 సంవత్సరంలో నాలుగెకరాల భూమిని పనుల కోసం ఒప్పందం మేరకు కౌలు (పరిహారం)పై ఇచ్చారు. ఒప్పందం చేసుకున్న రైతుల్లో ఇద్దరు మృతి చెందారు. రెండేళ్లుగా మంచిప్ప రిజర్వాయర్‌ పనులను నిర్వాసితుల కమిటీ అడుగడుగునా అడ్డుకుంటోంది. దీంతో పనులు నిలిచిపోయాయి. ఒప్పందం ప్రకారం కౌలు చెల్లిస్తున్నారు. తాజాగా ఒప్పందం ముగియడంతో మా భూమి మాకు కావాలని పట్టుబట్టారు. శనివారం బాధిత రైతులు కుటుంబసభ్యులు, గ్రామస్తులతో అక్కడికి చేరుకుని చనిపోయిన రైతులు ఫొటోలతో ఆందోళన, ధర్నా చేపట్టారు. చింతకుంట రాములు బ్యాచింగ్‌ ప్లాంట్‌ వద్ద సిమెంట్‌ సైలో ఎక్కి నిరసన తెలియజేశారు. ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

అధికారుల సమక్షంలో చర్చలు

భూమి ఇచ్చేయాలని బాధిత రైతులతో ఆందోళనకు దిగగా, పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించి చర్చలు జరిపారు. రాములు మినహా మిగతా వారి భూమి ఇచ్చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కానీ రాములుకు చెందిన 2.02 ఎకరాల భూమిని ఆరు నెలల తర్వాత ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏడాదికి రూ.1.30లక్షలు కౌలు చెల్లిస్తుండగా, అది పెంచి రూ.1.70 లక్షలు చెల్లించి ఒప్పందం గడువు పెంచుకుందామని ఆఫర్‌ ఇవ్వగా, ఆయన ససేమిరా అంటున్నారు. ఈ క్రమంలో ముంపు నిర్వాసితుల కమిటీ, రైతులు, కంపెనీ ప్రతినిధులు, ప్రాజెక్ట్‌ అధికారులు, పోలీసుల సమక్షంలో చర్చలు జరిగాయి. సుమారు రెండు గంటలకుపైగా జరిగిన చర్చలు అర్ధంతరంగా ముగిశాయి. మా భూమి మాకు కావాలని రైతులు చెప్పి వెళ్లిపోయారు. చర్చల్లో ప్రాజెక్ట్‌ డీఈ బాల్‌రాజ్‌, నవయుగ కంపెనీ ఏజీఎం కాశీ గోవింద్‌రావు, ఏఎస్సై రమేష్‌, ఉపసర్పంచ్‌ జగదీష్‌, ముంపు కమిటీ ప్రతినిధులు రాజేష్‌, భాస్కర్‌, బాధిత రైతులు పాల్గొన్నారు.





తెయూలో సంబురాలు



పటాకులు కాల్చి సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థి నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్‌ ఏసీబీకి చిక్కడంతో విద్యార్థి నాయకులు సంబురాలు చేసుకున్నారు. శనివారం రూ.50వేలు లంచం తీసుకుంటూ వీసీ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ విషయం తెలియగానే వర్సిటి ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ వద్ద కొందరు విద్యార్థి నాయకులు, కాంట్రాక్టు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది కలిసి టపాకాయలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. వీసీ తన అవినీతి, అక్రమాలతో తెయూ పేరు, ప్రతిష్టలను గంగలో కలిపారని విమర్శించారు. అవినీతికి పాల్పడే వారు ఎప్పటికైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నారు.

రైలుకు అడ్డంగా వెళ్లి హంగామా

కామారెడ్డి క్రైం: రైలుకు అడ్డంగా వెళ్లి ఓ వ్యక్తి హంగామా సృష్టించిన ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌ గ్రామానికి చెందిన పాపాన్నగారి రఘుపతి అనే వృద్ధుడు గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. శనివారం ఉదయం నిర్మాణం విషయంలో సమీప బంధువుల, కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన రఘుపతి కామారెడ్డికి వచ్చాడు. ఆత్మహత్య చేసుకుంటానని అప్పుడే వచ్చి నిలిపిన రైలు ముందుర తచ్చాడుతు కనిపించాడు. రైలు నడిపే లోకో పైలెట్‌, స్థానికులు ఎంతగా వారించిన వినలేదు. 15 నిమిషాల పాటు రైలుకు అడ్డంగా వెళ్తానని మొండి చేశాడు. దీంతో రైల్వే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్‌ ఇచ్చారు. దీంతో రైలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కస్తూర్బాలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్‌ ఆఫీసర్లు, సీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, పీటీ పోస్టులను, అలాగే అర్బన్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలల్లో స్పెషల్‌ ఆఫీసర్‌, సీఆర్‌టీ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుందన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీల భర్తీ కోసం మహిళ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుందన్నారు. ఈనెల 26 నుంచి జూలై 5 వరకు https:// schooledu. telangana. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

డైట్‌ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం..

జిల్లా కేంద్రంలోని డైట్‌ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్జెక్టులు ఫిలాసఫీ/సోషియాలజీ, సైకాలజీ, సామాన్య శాస్త్ర బోధన పద్ధతులు, గణిత శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు, తెలుగు బోధన పద్ధతులు, వ్యాయామ విద్య, కళ విద్య, ఉర్దూ మీడియంలో ఫిలాసఫీ, సామాన్య శాస్త్ర బోధన పద్ధతులు, గణిత శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధనపద్ధతులు, ఉర్దూ బోధన పద్ధతులు సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఈ నెల 30 వరకు డైట్‌ కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు. మెరిట్‌ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు 9848285028 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

- కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి



స్వామీజీకి పాదుకాపూజ చేస్తున్న ధన్‌పాల్‌

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: మానవాళి సుభిక్షంగా ఉండాలంటే సనాతన ధర్మం వర్ధిల్లాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. శనివారం నిజామాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా నివాసంలో స్వామివారికి పాదుకా పూజ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ధన్‌పాల్‌ కుటుంబం ప్రస్తుతం చేస్తున్న సేవాకార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. కాగా ఇందూరులో స్వామీజీ విజయయాత్ర ముగించుకుని నిర్మల్‌ వెళ్లారు. తరువాత ఆదిలాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ నెల 22న నాగ్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్‌ కేంద్ర కార్యాలయంలో చీఫ్‌ మోహన్‌ భాగవత్‌జీతో కలిసి కార్యక్రమంలో పాల్గొననున్నారు. అటునుంచి కాశీ వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో మణిమాల, ప్రణయ్‌కుమార్‌, వినయ్‌కుమార్‌, అనిత, చిద్రవర్‌ స్రవంతి పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



నర్వ సవిత(ఫైల్‌)

లింగంపేట: లింగంపేటకు చెందిన నర్వ సవిత (36) తన కూతురు పెళ్లి కావడం లేదని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన నర్వ ఆశయ్య, సవిత దంపతులకు కూతురు చందన, కుమారుడు చరణ్‌ ఉన్నారు. చందనకు 3 నెలల క్రితం సమీప బంధువుతో పెళ్లి కాయం చేసుకున్నారు. సదరు యువకుడు కొద్ది రోజుల క్రితం మరో అమ్మాయిని తీసుకొని గ్రామం నుంచి వెళ్లిపోయాడు. దాంతో అప్పటి నుంచి తన కూతురు వివాహం విషయంతో తరుచూ బాధపడేవారు. ఈ క్రమంలో సవిత ఈ నెల 15న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాదు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త ఆశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమించిన అబ్బాయితో పెళ్లి జరగదని యువతి..

బిచ్కుంద: ప్రేమించిన యువకుడితో పెళ్లి జరగదని ఓ యువతి ఒంటిపై పెట్రోల్‌ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బిచ్కుందలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బిచ్కుందకు చెందిన దివ్యశ్రీ (21) శాంతాపూర్‌ గ్రామానికి చెందిన దత్తును ప్రేమించింది. ఆ యువకుడు ఆమెకు అన్నయ్య వరుస కావడంతో మరిచిపోవాలని దివ్యశ్రీ తల్లి సూచించింది. దీంతో ప్రేమించిన అబ్బాయితో పెళ్లి జరగదని మనస్తాపం చెందిన దివ్యశ్రీ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటిపై పెట్రోల్‌ పోసుకొని నిప్పంటించుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

బిచ్కుంద: మండలంలోని ఫత్లాపూర్‌ గ్రామానికి చెందిన సిరికొండ సాయిలు (30) జీవితంపై విరక్తి చెంది శనివారం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సాయిలు కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఉపాధి దొరకక ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

గాంధారి: కుటుంబ కలహాలతో మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన కాముని మైశయ్య(40) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై గణేష్‌ తెలిపారు. వివరాలు.. మైశయ్య 2012లో బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లాడు. అక్కడ సంపాదించిన డబ్బులు ఎప్పటికప్పుడు భార్య యశోదకు పంపించాడు. అయితే నెల క్రితం మైశయ్య గ్రామానికి తిరిగి వచ్చాడు. కొత్త ఇల్లు నిర్మించుకుందామని, ఇప్పటి వరకు పంపించిన డబ్బులు లెక్క చెప్పాలని భార్యను అడిగాడు. తరువాత చెపుతానంటు భర్తకు నచ్చచెపుతూ వస్తుంది. అయితే శుక్రవారం రాత్రి డబ్బుల విషయంలో భార్య భర్తతు గొడవ పడ్డారు. మైశయ్య భార్యను కొట్టాడు. తరువాత ఇద్దరు వరండాలో పడుకున్నారు. రాత్రి 1.30 ప్రాంతంలో మైశయ్య చిన్న కొడుకు సోమ్‌దాస్‌ సినిమాకు వెళ్లి ఇంటికి వచ్చి చూసే సరికి మైశయ్య గదిలో దూలానికి వేలాడుతు కనిపించాడు. యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై పేర్కొన్నారు. కాగా మైశయ్య మృతిపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్‌

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సదాశివనగర్‌: మండలంలోని మల్లుపేట్‌ గ్రామానికి చెందిన ఒకరు చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్‌ తెలిపారు. ఈ నెల 8న మల్లుపేట్‌ గ్రామానికి చెందిన కుండల నారాయణ(70), ఉపాధి పని కోసం తన టీవీఎస్‌ ఎక్సెల్‌పై పద్మాజీవాడి చౌరస్తా వరకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మల్లుపేట్‌ స్టేజీ వద్ద రోడ్డు క్రాస్‌ చేస్తుండగా నిజామాబాద్‌ వైపు నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న ఫార్చునర్‌ కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధుడు..

ఎడపల్లి: ఎడపల్లి మండలం అంబం(వై) గ్రామానికి చెందిన గంగారం (66) చెరువులో పడి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై పాండేరావు తెలిపిన వివరాలు..గంగారం కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఎడపల్లి: మండలం పోచారం గేట్‌ సమీపంలో శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. కోటగిరి మండలం కొల్లూరు గ్రామానికి చెందిన అల్లంనేని చిట్టిబాబు(48), అతని స్నేహితుడు శివరాజ్‌తో కలిసి జానకంపేట నుంచి బోధన్‌ వైపు బైక్‌పై వెళ్తున్నారు. వీరిని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిట్టిబాబును జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

కరెంట్‌ షాక్‌తో వివాహిత..

నవీపేట: మండలంలోని అంజుమాన్‌ఫారమ్‌ గ్రామానికి చెందిన మంగాయమ్మ(46) శనివారం రాత్రి కరెంట్‌ షాక్‌కు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో బోరు మోటారు వేసి పైపుతో నీళ్ల పడుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌ షాక్‌కు గురైందని పేర్కొన్నారు.

పాఠశాలపై నుంచి దూకిన విద్యార్థిని

బాల్కొండ: బాల్కొండలోని మహత్మా జ్యోతిరావు పూలే బీసీ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న నవీపేట్‌ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి పాఠశాల భవనంపై నుంచి శనివారం దూకింది. దీంతో విద్యార్థిని ఎడమకాలుకు గాయామైంది. ఆమెను అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రిన్సిపాల్‌ హైమావతి తెలిపారు. పాఠశాలల్లో చదవుకోనని మొండితనంతోనే దూకినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు.

రైస్‌మిల్‌ యజమానిని బెదిరించిన ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ రైస్‌మిల్లు యజమానిని బెదిరించి డబ్బులు డిమాండ్‌ చేసిన ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్‌ శనివారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ఓర విఠల్‌కు చెందిన ఓంసాయి ఇండస్ట్రీస్‌ రైస్‌మిల్‌లో కామారెడ్డికి చెందిన ఇద్దరు విలేకరులు బాబురావు, గడీల రాజేందర్‌ వచ్చి పీడీఎస్‌ బియ్యంకు సంబంధించి లారీ వచ్చిందని లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే వార్తలు రాస్తామని బెదిరించినట్లు బాదితుడు ఫిర్యాదు చేశాడని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

పోలీసులకు అప్పగింత

మోపాల్‌: మండలంలోని మంచిప్ప గ్రామ శివారులోగల హనుమాన్‌ తండాలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని తండావాసులు శనివారం పోలీసులకు అప్పగించారు. గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతున్నారనే అనుమానంతో ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిర్మల్‌ జిల్లా భైంసాకు చెందిన వారని తెలిసింది. వారి వద్ద ఎలాంటి సామగ్రి లభించలేదు. అనంతరం విచారణ చేపట్టగా, హనుమాన్‌తండాకు చెందిన వారే తమ బంధువులని చెప్పి నలుగురిని తీసుకెళ్లారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



నస్రుల్లాబాద్‌: మండలంలోని మిర్జాపూర్‌ శివారులో పంట పొలాల్లో గల మూడు ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం రాత్రి చోరీ చేశారు. ఘటన స్థలాన్ని ఎస్సై రంజిత్‌రెడ్డి పరిశీలించారు. నాట్లు వేసే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు : ఇద్దరికి తీవ్రగాయాలు

కామారెడ్డి క్రైం: కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మున్సిపల్‌ పరిధిలోని టేక్రియాల్‌ వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గాంధారికి చెందిన ఎడపల్లి వినోద్‌, రాహుల్‌ కామారెడ్డిలో డిగ్రీ చదువుకుంటున్నారు. పరీక్ష రాసేందుకు బైక్‌పై కామారెడ్డికి వచ్చారు. మధ్యాహ్నం ఒకటిన్నర గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా టేక్రియాల్‌ గ్రామ స్టేజి వద్ద నిజామాబాద్‌ వైపు నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని కారు యు టర్న్‌ తీసుకోబోయి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన వినోద్‌, రాహుల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో వినోద్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

స్కూటీ, కారు ఢీ: మహిళకు గాయాలు

మాక్లూర్‌: మండలంలోని గుత్ప శివారులో 63వ నంబర్‌ జాతీయ రహదారిపై స్కూటీని కారు ఢీకొనడంతో మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆర్మూర్‌ మండలం సుర్బిర్యాల్‌కు చెందిన సర్పంచ్‌ గణేష్‌ కారులో నిజామాబాద్‌ నుంచి ఆర్మూర్‌ వైపు వెళ్తున్నాడు. గుత్ప శివారులో అపురూప వేంకటేశ్వర ఆలయం వద్ద ఆయన కారు ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొంది.

దీంతో స్కూటీపై ఉన్న మాక్లూర్‌ మండలం మాణిక్‌భండార్‌కు చెందిన మార సంధ్యకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఆమె ప్రస్తుతం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయమై ఎస్సై యాదగిరిగౌడ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.